క్లుప్తంగా

12 బాక్సుల కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుడి అరెస్టును చూపుతున్న సెబ్ సీఐ జయరాంనాయుడు

ఎమ్మిగనూరురూరల్: సెబ్ సర్కిల్ పరిధిలోని హాలహర్వి బస్టాప్ వద్ద ఆటోలో అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ జయరాంనాయుడు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం స్థానిక సెబ్ కార్యాలయం అవరణలో పట్టుబడిన మద్యం, ఆటో, నిందితుడిని అరెస్ట్ చూయించారు. ఆయన మాట్లాడుతూ.. నందవరం మండలం హాలహర్వి బస్టాప్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా ఆటోలో 12 బాక్సుల కర్ణాటక మద్యం పట్టుబడినట్లు తెలిపారు. నిందితులు మంత్రాలయం మండలం వగరూర్‌కు చెందిన చిక్కిం ఏసోబు పట్టుబడగా, రాయచూర్ జిల్లా గుంద్రేవులకు చెందిన భీమన్న పరారైనట్లు చెప్పారు. పట్టుబడిన 12 బాక్సుల్లోని 1,152 మద్యం టెట్రా ప్యాకెట్ల విలువ రూ.60 వేలు ఉంటుందని తెలిపారు. దాడుల్లో సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, హెచ్‌సీలు గోపాల్, లింగ ప్రసాద్, చంద్రమౌళి, కానిస్టేబుళ్లు, నరసింహారెడ్డి, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కలుగొట్ల గ్రామానికి చెందిన ముగ్గురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్‌ఐ పి.నిరంజన్‌రెడ్డి శుక్రవారం రాత్రి తెలిపారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. గ్రామంలోని ఎస్సీ కాలనీ సమీపంలో బుడగ జంగాలకు చెందిన వారు గుడిసెలు వేసుకొని నివాసం ఉంటున్నారు. గుడిసెల ముందు పురుషులు ఆరుబయట స్నానాలు చేస్తుండటం చూసిన మాల రంగన్న ఇళ్ల ముందు మహిళలు ఉంటారు లోపలికి వెళ్లి స్నానాలు చేయాలని చెప్పాడు. దీంతో కోపోద్రికులైన రాసూది భీమన్న, ఉపేంద్ర, శ్రీను కలిసి మాల రంగన్న, మాల బాలమునిపై దాడి చేసినట్లు, ఈ దాడిలో మాల మునిస్వామికి తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

హజ్ యాత్రికులపై భారం పడకుండా ప్రభుత్వ చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రం నుంచి హజ్‌యాత్రకు వెళ్లే ముస్లింలపై పడే అదనపు ఆర్థిక భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని, దీనిపై ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాషా ప్రకటన చేశారని జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యక్షుడు రియాజ్‌అహమ్మద్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. హజ్ యాత్రికుల సమస్యపై ఉపముఖ్యమంత్రితో పాటు హజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గౌసేఆజాం, ఎంపీ మిధున్‌రెడ్డి ఢిల్లీలో కేంద్ర పౌర విమానయాన శాఖ సంస్థ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కలిసి వివరించారన్నారు. మైనారిటీ హక్కుల సమితి అధ్యక్షుడు ఫారుక్‌షిబ్లీ అ విషయాలు తెలుసుకుని మాట్లాడాలని, టీడీపీకి తొత్తుగా మారిన ఫారుక్‌షిబ్లీ అనవసరంగా గందరగోళం సృష్టించడం తగదన్నారు.

నాడు- నేడు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ జయన్న

నందవరం: మండల పరిధిలోని ఇబ్రహీంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మన బడి నాడు- నేడు పనులను పీఆర్ ఏఈ జయన్న పరిశీలించారు. శుక్రవారం గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో టాయిలెట్ల నిర్మాణ పనులు, వంట గదుల నిర్మాణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు నాణ్యతతో చేపట్టాలని పీఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులకు సూచించారు. వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. ప్రస్తుతం పాఠశాలలో విద్యుత్, బొమ్మలు, గ్రీన్ బోర్డులు, ఫ్యాన్లు, టేబుళ్లు, తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ వంటి మౌలిక వసతులు పూర్తయ్యాయన్నారు. హెచ్‌ఎం బసవరాజు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆరుగురు ఆటోడ్రైవర్లపై కేసు

హొళగుంద: అతివేగం, అజాగ్రత్తగా వాహనం నడుపుతున్న హొళగుంద, ముద్దటమాగికి చెందిన ఆరుగురు ఆటోడ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు శుక్రవారం తెలిపారు. సదరు డ్రైవర్లు రోడ్లపై, గ్రామంలో ఆటోలను అతివేగంగా నడుపుతున్నారని, దీని వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్తున్నట్లు ఆయన వెల్లడించారు. వారిపై రోడ్డు నిబంధనల ఉల్లంఘన కారణంగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

కమిటీ గడువు పొడిగింపు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంక్ లిమిటెడ్ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ గడువును ఈఏడాది నవంబర్ 10వ తేదీ వరకు పొడిగిస్తూ కో–ఆపరేటివ్ సొసైటీస్ కమిషనర్ బాబు ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీ గడువు ఏప్రిల్ 10వ తేదీకి ముగియడంతో ప్రస్తుతం ఉన్న కమిటీనే కొనసాగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నట్లు చైర్మన్ యూకే రాజశేఖర్ శుక్రవారం సాయంత్రం తెలిపారు. గడువు పొడిగించేలా కృషి చేసిన ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డికి చైర్మన్, డైరెక్టర్లు ధన్యవాదాలు తెలిపారు.

ఉచితంగా విద్యుత్ మీటర్లు

- జగనన్న కాలనీల్లో పేదల ఇళ్లకు ఏర్పాటు చేయనున్న ప్రభుత్వం
- నియోజకవర్గంలో 52 జగనన్న కాలనీలు, 6,959 ఇళ్ల నిర్మాణాలు
- ఒక్కో మీటరుకు రూ.2 వేలు ఖర్చు

తుగ్గలి: పేదలందరికీ పక్కా ఇంటి భాగ్యం కల్పించాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల్లో విశాలమైన స్థలాల్లో లేఅవుట్లు ఏర్పాటుచేసి పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. ఆయా లేఅవుట్లలో విద్యుత్, తాగునీటి సౌకర్యం, రోడ్లు, కాలువలు తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. ఇళ్ల నిర్మాణాలకు ఒక్కో లబ్ధిదారుడికి రూ.1.80 లక్షలు ప్రోత్సాహకం అందిస్తోంది. పొదుపు సంఘాల ద్వారా బ్యాంకు రుణం మంజూరు చేయిస్తోంది. ఇసుక సరఫరాతో పాటు, ఐరన్, సిమెంట్, డోర్‌లు, కిటికీలు తదితర నాణ్యమైన సామగ్రి చౌకగా సమకూర్చుతోంది. ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేసుకునేందుకు తోడ్పాటునందిస్తోంది. ఇప్పుడు వైఎస్సార్ జగనన్న కాలనీల్లో నిర్మాణం పూర్తయిన ఇళ్లకు ఉచితంగా విద్యుత్ మీటర్లు అమర్చుతోంది.



రాతనలో నిర్మించిన పక్కా ఇల్లు

దీని కోసం ఒక్కో మీటరుకు రూ.2 వేలు చొప్పున వ్యయం చేస్తోంది.



తుగ్గలి జగనన్న కాలనీలో ఇంటికి బిగించిన విద్యుత్ మీటరు

నియోజకవర్గంలో వైఎస్సార్ జగనన్న కాలనీలు ఇలా..

నియోజకవర్గంలో పత్తికొండ, మద్దికెర, తుగ్గలి, కృష్ణగిరి, వెల్దుర్తి మండలాల్లో 52 జగనన్న కాలనీలు ఉన్నాయి. వీటిలో 6,959 ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. మరోవైపు పలువురు లబ్ధిదారులు సొంత స్థలాల్లో ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చిస్తోంది. నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు ఉచితంగా మీటర్లు అమర్చే పనిలో విద్యుత్ శాఖ సిబ్బంది నిమగ్నమయ్యారు. ఒక్కో ఇంటికి బోర్డుతో పాటు, మీటరు, విద్యుత్తు స్తంభం నుంచి ఇంటి వరకు అవసరమైన వైరు, ఇతర సామగ్రికి రూ.2 వేల వరకు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది.

ఉచితంగా విద్యుత్ కనెక్షన్



సొంతిల్లు నిర్మించుకోవాలన్నది మా కల. జగనన్న ప్రభుత్వం మాకు స్థలం మంజూరు చేసి ఇల్లు కట్టుకోవడానికి ఎప్పటికప్పుడు బిల్లులతో పాటు సిమెంటు, కడ్డీలు, ఇసుక, ఇంటి సామగ్రి మంజూరుచేసింది. ఇప్పుడు ఉచితంగా విద్యుత్ మీటర్ కూడా బిగించారు. కొత్త ఇంట్లోకి చేరాం. ఎంతో సంతోషంగా ఉంది. నెలనెలా బాడుగల నుంచి విముక్తి కలిగింది. జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. – రమీజా, రాతన

మీటర్లు బిగిస్తున్నాం



జగనన్న కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు లబ్ధిదారులు నిర్మించుకున్న ఇళ్లకు ఉచితంగా విద్యుత్తు మీటర్లు వచ్చాయి. మండలంలో ఇప్పటి వరకు 100కు పైగా మీటర్లు బిగించాం. త్వరలో పూర్తయిన అన్ని ఇళ్లకు మీటర్లు బిగిస్తాం.
– మహేశ్వరరెడ్డి, విద్యుత్ ఏఈ, తుగ్గలి

ఉపాధి పనుల పరిశీలన

తుగ్గలి: మండల పరిధిలోని ఉప్పర్లపల్లిలో ఉపాధి పథకంలో చేపట్టిన డగ్‌అవుట్ ఫాంపాండ్, చెక్‌డ్యాం పూడికతీత పనులను, పండ్ల తోటలను శుక్రవారం ఏపీఓ రామకృష్ణ తనిఖీ చేశారు. కూలీల మస్టర్లను పరిశీలించారు. కొలతల ప్రకారం పనిచేస్తే రోజూ రూ.272 వేతనం లభిస్తుందని కూలీలకు సూచించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున పనిచేసే ప్రదేశంలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, ప్రథమచికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలన్నారు. వడదెబ్బకు గురికాకుండా టెంట్లు ఏర్పాటు చేయలన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ రాజునాయక్ ఉన్నారు.

విద్యార్థులకు గ్లాసులు మంజూరు

మద్దికెర: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వారానికి మూడు రోజులు రాగిజావా ఇచ్చి వారిలో ఉత్సాహం నింపడమే లక్ష్యమని ఎంఈఓ రంగస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని 26 పాఠశాలలకు చెందిన 3,300 మంది విద్యార్థులకు గ్లాసులు మంజూరు కావడంతో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు అందించారు. విద్యార్థులు రాగి జావా తాగేందుకు గ్లాసులు అందించనున్నట్లు వారు తెలిపారు.

జూన్ నుంచి రాగులు, జొన్నల పంపిణీ

రేషన్‌కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర సరుకులతో పాటు జూన్ నెల నుంచి రాగులు, జొన్నలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ నాగరాజు శుక్రవారం తెలిపారు. బియ్యం వద్దనుకున్న వారికి 3 కిలో వరకు జొన్నలు లేదా రాగులు పంపిణీ చేస్తారన్నారు.

జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టండి

గోనెగండ్ల: జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని, లేకపోతే పట్టాలు రద్దు చేస్తామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్ హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన, ఎంపీడీఓ నాగేష్ ఆధ్వర్యంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. తహసీల్దార్ వేణుగోపాల్ మాట్లాడుతూ.. మండలంలోని 8 గ్రామాల్లో సర్వే పూర్తయ్యిందని, మరో 8 గ్రామాల్లో సర్వే కొనసాగుతోందని పేర్కొన్నారు. ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం 85 శాతం పూర్తయ్యిందని తెలిపారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ మాట్లాడుతూ.. మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ సిబ్బంది సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కో–ఆప్షన్ మెంబర్ బందెనవాజ్, అగ్రహారం సర్పంచ్ రంగారెడ్డి అధికారుల దృష్టికి తెచ్చారు. ఎంఈఓ వినోద్‌కుమార్ మాట్లాడుతూ మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిబంధనల ప్రకారం నైట్ వాచ్‌మన్‌లను నియమించినట్లు తెలిపారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో తాగునీటి పైప్‌లైన్ పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే జలజీవన్ పథకం కింద ఇంటింటికీ కొళాయి కనెక్షన్ కోసం మండలంలోని 28 గ్రామాలకు రూ.35 కోట్ల నిధులు మంజూరయ్యాయని, టెండర్ పనులు పూర్తవ్వగానే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. అలువాల ఎస్‌ఎస్ ట్యాంక్ నుంచి 9 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుందని మరో 20 రోజుల్లో ట్యాంక్ పూర్తిగా అడుగంటిపోతుందని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోని తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని సర్పంచ్ బాషా అధికారుల దృష్టికి తెచ్చారు. ఏఓ రాజాకిషోర్ మాట్లాడుతూ పీఎం కిసాన్ డబ్బులు పడని రైతులు ఆర్‌బీకే కేంద్రాలకు వెళ్లి సరిచూసుకోవాలన్నారు. అలాగే ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు గుర్తించిన సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీపీ సూచించారు. వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ కాశిరెడ్డి, నాయకులు బందెనవాజ్, ఆయా శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ రాఘవేంద్ర సూచించారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. విద్యార్థులు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.150, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.75 దరఖాస్తు ఫీజు చెల్లించి నమోదు చేసుకోవాలని చెప్పారు. 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష తెలుగు, ఇంగ్లిష్‌లో ఉంటుందని, ఓసీ, బీసీ విద్యార్థులకు 35 మార్కులు, ఎస్సీ, ఎస్టీలకు 30 మార్కులు కనీస అర్హతగా పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష కడివెళ్ల మోడల్ స్కూల్‌లో జూన్ 11వ తేదీ ఉంటుందని చెప్పారు. www.cse.ap.gov.in/www.apms.ap.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 95022 46367, 96522 53433 నంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు.

ఐటీఐ కోర్సుకు దరఖాస్తు చేసుకోండి

ఆలూరు రూరల్: 2023–24 సంవత్సరానికి ఆలూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో చదువుకునేందకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్ శుక్రవారం పత్రిక ప్రకటనలో వెల్లడించారు. ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, డ్రస్ మేకింగ్, కంప్యూటర్ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు జూన్ 6వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు www.iti.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఆలూరు ఐటీఐ కళాశాలలో సంప్రదించాలని కోరారు.

22న కలెక్టరేట్ ఎదుట ధర్నా

తుగ్గలి: ఉపాధి కూలీల డిమాండ్ల సాధనే లక్ష్యంగా ఈనెల 22న కర్నూలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీరాములు తెలిపారు. ధర్నాను విజయవంతం కోసం శుక్రవారం తుగ్గలి, జొన్నగిరిలో ఉపాధి పనుల ప్రదేశానికి వెళ్లి కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకానికి 30 శాతం నిధులు తగ్గించిందని, దీంతో మెటీరియల్ పనులు పెంచి ఉపాధి కూలీల పొట్ట కొట్టేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. కూలీలకు మెరుగైన ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధన కోసం చేపట్టే ధర్నాకు కూలీలు అధికంలో తరలి వచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగుల పనితీరును పర్యవేక్షించండి

ఆలూరు: వివిధ గ్రామ సచివాలయాలలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆలూరు ఎంపీపీ రంగమ్మ శుక్రవారం ఎంపీడీఓ అల్లబకాష్‌ను కోరారు. మండలంలో 17 సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు విధి నిర్వహణలో సమయపాలన పాటించడం లేదని ప్రజలు, రైతులు, విద్యార్థులు తదితరుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ఖరీఫ్ సీజన్ దగ్గర పడుతున్న సందర్భంగా ఆర్‌బీకేల సిబ్బంది అందుబాటులో ఉండాలని, పాఠశాలలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులకు కుల, ఆధాయ సర్టిఫికెట్లను మంజూరు చేయడానికి వీఆర్వోలు అందుబాటులో ఉండి విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తితో పులకించిన తాపలకొత్తూరు

కృష్ణగిరి: విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలతో తాపలకొత్తూరు గ్రామం భక్తితో పులకించింది. శుక్రవారం ఉదయం కాశీ విశాలాక్షి, విశ్వేశ్వర స్వామి, నంది విగ్రహ, కలశ ప్రతిష్ఠతోపాటు నూతనంగా నిర్మించిన దేవాలయం ముందు ధ్వజస్తంభాన్ని గ్రామస్తులు ప్రతిష్ఠించారు. ప్రతి ఇంటి నుంచి నైవేద్యం తెచ్చి స్వామి, అమ్మవార్లకు సమర్పించారు. స్వామివారి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. ఎంపీపీ డాక్టర్ కంగాటి వెంకటరామిరెడ్డి, పత్తికొండ మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ మాధవరావు, కటారుకొండ ఎంపీటీసీ మురళీధర్‌రెడ్డి తదితరులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం ఇంటి ఆడబిడ్డలకు ఒడిబియ్యం పోశారు.



శివాలయం ముందు ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించి పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆలూరు రూరల్: ఆలూరు విద్యుత్ సబ్ డివిజన్‌లోని ఆలూరు, ఆస్పరి, చిప్పగిరి, హాలహర్వి, హొళగుంద మండలాల విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆలూరు డిప్యూటీ డివిజనల్ ఇంజినీర్ నాగేంద్రప్రసాద్ శుక్రవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తీగల మరమ్మతులు, విద్యుత్ తీగలపై వేలాడుతున్న చెట్టు కొమ్మలు తొలగిస్తున్న కారణంగా శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సహకరించాలని డీఈఈ నాగేంద్ర ప్రసాద్ కోరారు.

మద్దికెర: మండలంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని విద్యుత్ శాఖ ఏఈ మహేశ్వర రెడ్డి కోరారు. సబ్‌స్టేషన్, విద్యుత్ లైన్లలో మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ప్రజలు గమనించాలని కోరారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

ఆలూరు: సబ్‌డివిజన్ పరిధిలో విద్యుత్ అక్రమంగా వాడుకుంటున్నట్లు తమ దృష్టికి వస్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని ఏడీఈ ఏ.నాగేంద్ర హెచ్చరించారు. హాలహర్వి, హొళగుంద మండలాలు, గ్రామాల్లో అక్రమ విద్యుత్ వాడకంపై శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం స్థానిక ఏడీఈ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సబ్ డివిజన్ పరిధిలో కేటగిరీ 1, 2 విద్యుత్ కనెక్షన్లు సుమారుగా 65 వేలు ఉన్నాయని తెలిపారు. వినియోగదారుల నుంచి బిల్లులు పెండింగ్‌లో లేకుండా ఎప్పటికప్పుడు వసూలు చేయాలని ఏఈ, బీఎల్‌ఐ, జేఎల్‌ఎంలు, బిల్ కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు ఉన్న ఎర్త్, హైఓల్టేజీ, సర్వీసు వైర్, జేవైర్, ఎల్‌సీలపై జాగ్రత్త చర్యలు తీసుకోవాలని పోల్‌టూ, పోల్ సిబ్బందికి సూచించామన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, ఇతర సమస్యలపై ఏఈలు లేదా తన సెల్ 94408 13338 నంబర్‌కు కాల్ చేయవచ్చని సూచించారు.

నేడు విద్యుత్ కోతలు: సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల దృష్ట్యా శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా ప్రభోత్సవం

నందవరం: బాజా భజంత్రీలు, డోలు సన్నాయిల నడుమ అవధూత శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ ప్రభోత్సవం వైభవంగా సాగింది. ఆలయ పూజారులు లక్ష్మయ్య ఆచారి, వెంకటేష్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో తెల్లవారుజామున మూలవిరాట్‌కు క్షీరాభిషేకం, పట్టువస్త్రాలు, పూల అలంకరణతో విశేష పూజలు చేపట్టారు. భక్తులు పిండి వంటలు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం లక్ష్మమ్మవ్వ చిత్రపటం ప్రభపై ఉంచి నందికోలు సేవతో పాటు భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథాన్ని చివరి వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, సర్పంచ్ మద్దీశ్వరి, వైస్ ఎంపీపీ షేక్‌సాహెబ్, ఎంపీటీసీ సుశీలమ్మ, ఉప సర్పంచ్ లక్ష్మీకాంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మహాయోగి లక్ష్మమ్మవ్వ

ముందస్తు అడ్మిషన్లపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: విద్యాశాఖ అనుమతుల్లేకుండా ముందస్తు అడ్మిషన్లు చేసుకుంటూ వేలాది రూపాయల ఫీజులను తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్న పట్టణంలోని ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌పీఎస్‌ఎఫ్ సంఘ రాష్ట్ర కార్యదర్శి ఆఫ్రిది డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఎంఆర్సీలో డిప్యూటీ డీఈఓ సుకుమార్, ఎంఈఓ ఆంజనేయులుకు వినతి పత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్లు చేయడమే గాకుండా కార్పొరేట్ పాఠశాలల్లో సీబీఎస్‌ఈ సిలబస్ బోధించేందుకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. ఆయా పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



డిప్యూటీ డీఈఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

మరమ్మతులు చేపట్టండి

హొళగుంద: మార్లమడికి గ్రామం వద్ద ఆంధ్రా–కర్ణాటక సరిహద్దును కలిపే వేదావతి(హగరి) కల్వర్టు దెబ్బతిందని వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని ప్రయాణికులు, సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. కల్వర్టు వద్ద రోడ్డుపై గుంతలు పడి పటిష్టత కోల్పోయిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పరిమితికి మించి అధిక లోడులతో వాహనాలు తిరగడం వల్ల ఈ సమస్య ఏర్పడిందని ఆరోపిస్తున్నారు. మరో వైపు బ్రిడ్జ్ చుట్టూ పరిసరాల్లో ఇసుకను తరలించడం వల్ల బ్రిడ్జి ప్రమాద స్థాయికి చేరుకుంటుందని వాపోతున్నారు. అధికారులు స్పందించి బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని అలాగే భారీ వాహనాల రాక పోకలను నిషేధించాలని కోరుతున్నారు.



మార్లమడికి వద్ద దెబ్బతిన్న వేదావతి (హగరి) కల్వర్టు

ప్రభుత్వ స్థలాల పరిరక్షణకు చర్యలు

మద్దికెర: ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీఓ నరసిహమూర్తి, మాజీ ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల సర్వేయర్ సుధాకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ స్థలాలను సర్వే చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురికాకుండా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ రూ.25 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపడుతున్నామన్నారు. దీనివల్ల తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంఈఓ, ఉపాధి, వైఎస్సార్ క్రాంతిపథం, హౌసింగ్ కార్యాలయాలు, సచివాలయాలు, కస్తూరిబా విద్యాలయం ఒకే చోట ఉండడమే గాకుండా పరిసరాలలో అసాంఘిక కార్యాకలపాలు జరగకుండా ఇతరులు లోపలికి ప్రవేశించకుండా చర్యలు తీసుకునేందుకు వీలవుతుందన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో నర్సుల దినోత్సవం



నర్సులను అభినందిస్తున్న సొసైటీ అధ్యక్షుడు రామ్మోహన్, వైద్యులు

పత్తికొండ రూరల్: స్థానిక ప్రభుత్వాసుపత్రిలో మైత్రి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం నర్సుల దినోత్సవం నిర్వహించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామ్మోహన్ ప్రభుత్వ వైద్యురాలు హారిక, నర్సులు సరోజ, హేమలత, దస్తగిరమ్మ, గాయత్రిలను శాలువా, పూలమాలలతో సత్కరించారు. కోవిడ్ సమయంలో నర్సులు అందించిన సేవలను రామ్మోహన్ కొనియాడారు. సింగిల్ విండో సొసైటీ మాజీ అధ్యక్షుడు చల్లారవీంద్ర, హాస్పిటల్ సిబ్బంది దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

వేరుశనగ విత్తనాల కేటాయింపు

కృష్ణగిరి: రానున్న ఖరీఫ్‌లో మండలంలో వేరుశనగ సాగు కోసం ప్రభుత్వం సబ్సిడీ కింద 3,099 క్వింటాళ్ల విత్తనాలను కేటాయించినట్లు ఏఓ వెంకటేశ్వర్లు శుక్రవారం తెలిపారు. మండలం నుంచి పంపిన ప్రతిపాదనల మేరకు విత్తనాలు మంజూరైనట్లు చెప్పారు. సోమవారం నుంచి ఆయా గ్రామాల్లోని ఆర్‌బీకే కేంద్రాల్లో విత్తనాల కోసం రిజిస్ట్రేషన్ ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు.

పనులు పెండింగ్ పెట్టొద్దు

హొళగుంద: పథకాలు, ఇతర సేవలకు సంబంధించిన పనులను పెండింగ్ పెట్టకుండా వెంటనే పూర్తి చేయాలని ఎంపీడీఓ దాసానాయక్ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సూచించారు. ఆయన శుక్రవారం వందవాగిలి గ్రామ సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పథకాల అమలు, సచివాలయ సిబ్బంది పాటిస్తున్న పని వేళలు, హాజరు శాతం తదితర వాటిని పరిశీలించారు. పథకాలు సక్రమంగా అందుతాయా, పనులు జరుగుతాయా తదితర వివరాలను సచివాలయాలకు వచ్చిన ప్రజలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఉద్యోగులు ప్రజలకు అందుబాటలో ఉండాలని నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్తమ పంచాయతీగా ఎం.అగ్రహారం

మద్దికెర: మండల పరిధిలోని ఎం.అగ్రహారం ఉత్తమ పంచాయతీగా ఎంపికై నట్లు జిల్లా పంచాయతీ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని సర్పంచ్ బురుజుల విజయుడు, కార్యదర్శి సంజప్ప శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి పథకం కింద ఎంపికచేసి రూ.50 వేలు నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. గ్రామాభివృద్ధికి సహకరించిన ప్రజలకు, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి

గోనెగండ్ల: గ్రీన్ అంబాసిడర్ స్వచ్ఛభారత్ పారిశుద్ధ్య కార్మికుల పెండింగ్ వేతనాలను మంజూరు చేయాలని కార్మికులు వెంకటేశ్వరమ్మ, నాగరాజు, రామేశ్వరమ్మ కోరారు. ఈ మేరకు శుక్రవారం కార్మికులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ టీ.నసురుద్దీన్, తహసీల్దార్ వేణుగోపాల్, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగేష్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఇప్పటివరకు 14 నెలల వేతనాలు ఇవ్వలేదని, కుటుంబాలను పోషించుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. స్పందించిన అధికారులు పెండింగ్ వేతనాలు త్వరగా మంజూరు చేయించేందుకు కృషి చేస్తామని హామీఇచ్చారు.

రమణీయం.. రథోత్సవం

హొళగుంద: లింగంపల్లి గ్రామంలో వెలిసిన కొల్లాపురమ్మ, రాములమ్మ అవ్వల రథోత్సవం శుక్రవారం సాయంత్రం రమణీయంగా జరిగింది. ఉదయం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. జలాభిషేకాలు, ఆకుపూజ, మహా మంగళహారతి, నైవేద్య సమర్పణ తదితర పూజలను వేద పండితులు ఘనంగా జరిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తులను రథంపై ప్రతిష్ఠించి అశేష భక్తజనుల మధ్య రథోత్సవం వైభవంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఎస్‌ఐ శ్రీనివాసులు బందోబస్తు చేపట్టారు. శనివారం లంకాదహనం, ఆదివారం వసంతోత్సవ కార్యక్రమలతో ఉత్సవాలు ముగుస్తాయని గ్రామస్తులు తెలిపారు.

అర్హులైన రైతులందరికీ భరోసా

తుగ్గలి: అర్హులైన వారందరికీ ప్రభుత్వం రైతు భరోసా పథకం కింద పెట్టుబడి సాయం అందిస్తుందని వ్యవసాయ శాఖ మండల అధికారి పవన్ కుమార్ అన్నారు. 2023 అర్హుల రైతు జాబితాను రాతన ఆర్‌బీకేల్లో ప్రదర్శించారు. అన్ని ఆర్‌బీకేల్లో జాబితాలను ప్రదర్శించామని రైతులు సరి చూసుకోవాలన్నారు. అర్హత ఉండి జాబితాలో పేర్లు లేని రైతులు, కొత్తగా పాసుపుస్తకాలు చేయించుకున్న వారు 18వ తేదీలోగా ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

మజ్జిగ పంపిణీ

వెల్దుర్తి(కృష్ణగిరి): అసలే ఎండలు ఆపై ఉక్కపోతతో జనాలు అల్లాడిపోతున్నారు. గుక్కెడు చల్లనీరు దొరుకితే చాలనుకునే వారో ఎందరో ఉన్నారు. ఈ స్థితిలో శుక్రవారం వెల్దుర్తి హెల్పింగ్ హ్యాండ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడం ఆనందంగా ఉందని సొసైటీ అధ్యక్షుడు హరిసింహనాయుడు అన్నారు. ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేకు సహకరించాలి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఫీల్డ్ ప్యూరిఫికేషన్ ఆఫ్ ల్యాండ్ రికార్డుల ప్రక్షాళన పకడ్బందీగా చేపట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని ఇందుకు రైతులందరూ సహకరించాలని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ సుబ్బారెడ్డి కోరారు. వెల్దుర్తి మండల పరిధిలోని పుల్లగుమ్మి, కలుగొట్ల గ్రామాల్లో శుక్రవారం ఆయన రీసర్వేపై ఆయా గ్రామాల రైతులకు అవగాహన కల్పించారు. శనివారం నుంచి ఈ రెండు గ్రామాల్లో రీసర్వే ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయికి వచ్చే అధికారులకు రైతులు సహకరిస్తే సర్వే వేగవంతంగా పూర్తవుతుందన్నారు. డీటీ ప్రవీణ్‌కుమార్, సర్వేయర్ హేమంత్ రెడ్డి, వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లు, రైతులు పాల్గొన్నారు.